సాక్షి చిత్తూరు

శుక్రవారం । 16 । జూన్ । 2023



ఉపాధిలో వెనుకబాటెందుకు?

ఉపాధి హామీలో పనిదినాల పురోగతిలో ఎందుకు వెనుకబడుతున్నారంటే కలెక్టర్ షణ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. -8లో



మృత్యు ఘీంకారం

పలమనేరు కౌండిన్య పరిధిలో విద్యుత్, రోడ్డు ప్రమాదాలబారిన పడి పదేళ్లలో 20 ఏనుగులు మృత్యువాత పడ్డాయి. -10లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	40	27
తిరుపతి	42	29
తిరుమల	37	24
గూడూరు	43	31
నగరి	42	29

న్యూస్‌రీల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పాసులు చెల్లుబాటు



డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి

చిత్తూరు రూరల్: జర్నలిస్టు బస్సు పాసులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చెల్లుతాయని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో గురువారం ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పాత చిత్తూరు జిల్లా ప్రకారం జర్నలిస్టుల బస్సు పాసులు చెల్లుతాయన్నారు. పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సప్తగిరి ఎక్స్‌ప్రెస్, అల్ట్రా డీలక్స్, సూపర్‌లగ్జరీ సర్వీసుల్లో ప్రయాణించేందుకు వారికి అనుమతులు ఉన్నాయన్నారు. దీనిపై అధికారులు ఆయా డిపోల పరిధిలో నోటీసులు అతికించాలని సూచించారు. కండక్టర్, డ్రైవర్ వాట్సాప్ గ్రూపుల్లో జర్నలిస్టు బస్సుపాసుల అమలును తెలియజేయాలని సూచించారు. ప్రయాణంలో వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆరోగ్య వివరాలు సమర్పించాలి

చిత్తూరు రూరల్: జిల్లాలోని ఆర్టీసీ ఉద్యోగులు విధిగా ఆరోగ్య వివరాలను డిపో అధికారులకు సమర్పించాలని డీపీటీఓ జితేంద్రనాథ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల్లో ఆరోగ్య వివరాలను పక్కాగా ఇవ్వాలని అందులో స్పష్టం చేశారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులు ఆధార్‌కార్డు నకలు పత్రాలను ఆయా డిపోల పరిధిలోని అధికారులకు అందజేయాలని సూచించారు.

హెల్త్ స్కీంకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్‌స్కీంకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ షణ్మోహన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో 2023-24 కాలపరిమితితో అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులు హెల్త్‌స్కీంకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. www.cfms. ap.gov.in వెబ్‌సైట్‌లో డీడీవో కోడ్ 2703-0802-003 ద్వారా హెడ్‌ఆఫ్ అకౌంట్ 8342-00-120-01-03-001 పద్దుకు రూ.1250 చెల్లించి 31-03-2024 వరకు ఈ పథకం లబ్ధి పొందవచ్చన్నారు. ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజినల్ చలానా, గతంలో జారీ చేసిన హెల్త్ కార్డు జిరాక్స్, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీలను కలెక్టరేట్‌లోని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ప్రీమియం రూ.2,500 కాగా ఇందులో జర్నలిస్టు వాటా రూ.1,250, ప్రభుత్వం వాటా రూ.1,250గా ఉంటుందన్నారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ వల్ల జర్నలిస్టులు, కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2 లక్షల వరకు వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చని తెలిపారు. ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితి లేకుండా ఈ సదుపాయాన్ని అందిస్తారన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్‌ను ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్) తరహాలో జర్నలిస్టులు వైద్య సేవలు పొందవచ్చన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ పొందే వైద్యసేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవని తెలిపారు. అక్రిడిటేషన్ పొందిన జర్నలిస్టులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ ఆ ప్రకటనలో కోరారు.

కాణిపాక హుండీ ఆదాయం రూ.1.21కోట్లు



కాణిపాకంలో హుండీ కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి హుండీ ఆదాయం రూ.1.21 కోట్లు వచ్చినట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు. గత 15 రోజుల హుండీ కానుకలను గురువారం ఉదయం స్వామివారి ఆస్థాన మండపంలో ఆలయ సిబ్బంది లెక్కించగా బంగారం 75 గ్రాములు, వెండి 4.96కిలోలు, గో సంరక్షణ హుండీ ద్వారా రూ.19 వేలు, యూఎస్‌ఏ డాలర్లు 683, ఆస్ట్రేలియా డాలర్లు 10, మలేషియా రింగిట్స్ 101, ఇంగ్లాండ్ పౌండ్స్ 10, సింగపూర్ డాలర్లు 10, కెనడా డాలర్లు 10 కలిపి మొత్తం రూ.1.21 కోట్లు వచ్చినట్లు ఆలయ చైర్మన్, ఈఓ తెలిపారు. దీన్ని ఆలయ అభివృద్ధి కార్యక్రమాలకు ఉపయోగించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎస్వీ కృష్ణారెడ్డి, రవీంద్రబాబు, విద్యాసాగర్ రెడ్డి, హేమమాలిని, హరిమాధవ రెడ్డి, పర్యవేక్షకులు రవి, దేవస్థానం సిబ్బంది, కాణిపాక యూనియన్ బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

జీడీనెల్లూరు: విద్యార్థులను సత్కరించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి



పుత్తూరు: సత్కారం అందుకున్న విద్యార్థులతో ఆర్కే సెల్వమణి



ప్రతిభకు ప్రోత్సాహం

- పండుగలా 'జగనన్న ఆణిముత్యాలు'
- నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులకు సత్కారం
- హాజరైన డిప్యూటీ సీఎం, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ప్రతిభ చూపిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం నగదు బహుమానాలు అందజేసింది. నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు అట్టహాసంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 2023 పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా అవార్డులతో సత్కరించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. విద్యార్థులను, తల్లిదండ్రులను శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

నియోజకవర్గ స్థాయిలో ఇలా..

- ఆయా నియోజకవర్గ పరిధిలోని సర్కారు విద్యాలయాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం ప్రతిభా అవార్డులు అందజేశారు. టెన్త్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా, రూ.15,000, రూ.10,000, రూ.5000 నగదు బహుమతి ఇచ్చారు. ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000 చొప్పున నగదు బహుమతిని అందజేశారు. గంగాధరనెల్లూరు నియోజకవర్గం కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పుంగనూరు నియోజకవర్గం కొత్తఇండ్లు హైస్కూల్, పలమనేరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు పాల్గొన్నారు. చిత్తూరు సంతపేట మున్సిపల్ హైస్కూల్లో ఎమ్మెల్యే ఆరణిశ్రీనివాసులు, నగర మేయర్ అముద, పూతలపట్టు నియోజకవర్గం ఐరాల మండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు, నగరి నియోజకవర్గం పుత్తూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో దక్షిణ భారత సినీ కార్మికుల సమాఖ్య (ఫెప్సీ) అధ్యక్షుడు ఆర్.కె. సెల్వమణి పాల్గొని విద్యార్థులకు అవార్డులను అందజేశారు.







విద్యార్థులకు నగదు బహుమతులు అందిస్తున్న చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

కుప్పానికి చెవిలో పువ్వు!

- ఎన్నికలు సమీపిస్తున్న వేళ హామీల వర్షం
- ఎన్నికల్లో అభ్యర్థి మీరేనంటూ ఇద్దరు నేతలకు హామీ
- నేతలను పార్టీలో చేర్చుకోవడం.. ఆపై వదిలేయడం పరామామూలే
- కుప్పం ప్రజలను విస్మరిస్తున్న చంద్రబాబు



సాక్షి, తిరుపతి: చిత్తూరు జిల్లాలోని కుప్పం నియోజకవర్గం స్థానిక ఎమ్మెల్యే, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు మోసపూరిత హామీలతో తడిసిముద్దవుతోంది. మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం కుప్పంకు చేరుకున్న ఆయన గురువారం కూడా అదే పంథాలో అలవికాని హామీలు గుప్పించారు. కొందరికి టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేరినట్లు ప్రకటించారు. ఇందులో టీడీపీ నేతలు కూడా ఉండడం చూసి అక్కడి వారు నవ్వుకున్నారు.

నాడు అలా..

'ఇవే నా చివరి ఎన్నికలు.. టీడీపీలో చేరినా..చేరకపోయినా.. గెలుపునకు సహాయం చేసినా చేయకపోయినా.. 2024లో కుప్పం టీడీపీ అభ్యర్థి నువ్వే' అని అంటూ 2018లోనే జెడ్పీ మాజీ చైర్మన్, అప్పటి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డికి హామీ ఇచ్చారు. ఆపై 2019 ఎన్నికల్లో ఆయన్ను టీడీపీ నాయకులు కరివేపాకులా వాడుకుని వదిలేశారు.

నేడు ఇలా..

ఇప్పుడు చంద్రబాబు అదేతరహాలో మాజీ డీసీసీ అధ్యక్షుడు, ఏఐసీసీ సభ్యుడు డాక్టర్ బీఆర్‌డీ సురేష్‌కి హామీ ఇచ్చారు. 'నాకు వయసైపోయింది. ఇవే నా చివరి ఎన్నికలు. ఈ ఎన్నికల్లో నాకు సహాయం చేస్తే.. 2029 కుప్పం టీడీపీ అభ్యర్థి నువ్వే' అని హామీ ఇచ్చారనే ప్రచారం కుప్పంలో జరుగుతోంది. అందులో భాగంగానే డాక్టర్ సురేష్‌బాబు గురువారం టీడీపీ కండువా కప్పుకున్నారు.

ప్రతిసారీ బురిడీ

స్థానికులు ఎక్కువశాతం మంది పక్కనే ఉన్న బెంగళూరుకు వెళ్లి వస్తుంటారు. ఏపీలో ఉన్నా.. వ్యాపార లావాదేవీలు, ఉద్యోగాలు, కూలి పనుల కోసం బెంగళూరుపై ఆధారపడుతారు. అటువంటి ఓటర్లను దృష్టిలో ఉంచుకుని చంద్రబాబు కుప్పాన్ని బెంగళూరు శాటిలైట్ టౌన్‌గా చేస్తానని ప్రతి ఎన్నికలకు ముందు ఇచ్చే హామీ. అంటే.. ఉపాధి కోసం బెంగళూరు వెళ్లే అవకాశం లేకుండా అక్కడి పరిశ్రమలు, ఐటీ సంస్థలను కుప్పానికి తీసుకొచ్చి.. ప్రత్యేక సదుపాయాలతో పట్టణాన్ని తీర్చిదిద్దుతామని హామీ ఇస్తారు. అయితే 14 ఏళ్లు సీఎంగా ఉన్నా, ఎమ్మెల్యేగా ఉన్నా ఏ ఒక్క భారీ పరిశ్రమను, ఐటీ సంస్థను తీసుకొచ్చిన దాఖలాలు లేవు.

బాబు బడాయి!

- 2016లో సీఎం హోదాలో కుప్పానికి వచ్చిన చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో రూ.3వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని ఊదరగొట్టారు. మరో రూ.700 కోట్లతో రష్యా సహకారంతో వంద మెట్రిక్ టన్నుల ప్రాసెసింగ్ సామర్థ్యం ఉన్న ఆహార శుద్ధి పరిశ్రమ తీసుకొస్తున్నట్లు సీఎం హోదాలో ప్రకటించి మిన్నకుండిపోయారు.
- 1994 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీల్లో.. ప్రతి ఇంటికీ రెండు పాడి ఆవులు, ఒక ఉద్యోగం. ఆ ఎన్నికల్లో చంద్రబాబు మొదటిసారిగా మంత్రి అయ్యారు. 1995లో ఎన్టీఆర్‌కి వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి అయ్యారు. అయినా ఏ ఒక్క హామీ నెరవేర్చలేదు.
- 2014 ఎన్నికల ముందు ప్రతి మండలంలో పదివేల మందికి ఉపాధి కల్పించే విధంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అదే విధంగా ప్రతి మండలంలో మినీ స్టేడియం నిర్మిస్తానని ప్రకటించారు. ఇంకా మండలానికి ఒక రైతుబజార్, పేదలందరికీ డీకేటీ భూముల పంపిణీ వంటి హామీల్లో ఏ ఒక్కటీ అమలైన దాఖలాలు లేవు.

ప్రశాంతంగా బదిలీల ప్రక్రియ



బదిలీల ప్రక్రియలో నగర కమిషనర్ అరుణ

చిత్తూరు అర్బన్: జిల్లాలోని వార్డు కార్యదర్శుల బదిలీల ప్రక్రియ గురువారం చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రశాంతంగా జరిగింది. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు బదిలీల ప్రక్రియను నగర కమిషనర్ అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ కేటగిరీల కింద బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వార్డు కార్యదర్శులు నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకొని కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు కమిషనర్ మార్గనిర్దేశం చేశారు. అనంతరం నగర/పురపాలక కమిషనర్లు, అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారుల సమక్షంలో ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించారు. పూర్వపు చిత్తూరు జిల్లా పరిధిలోని అడ్మిన్ కార్యదర్శులు -13, ప్రణాళిక కార్యదర్శులు -16, అమినిటీ కార్యదర్శులు -14, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ -16, వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్యదర్శులు -18, పారిశుధ్య పర్యావరణ కార్యదర్శులు -12 చొప్పున మొత్తం 89 కార్యదర్శులు హాజరయ్యారు. కార్యక్రమంలో నగరి కమిషనర్ వెంకటరామిరెడ్డి, శ్రీకాళహస్తి కమిషనర్ బాలాజీ, అనంతపురం ఆర్డీ కార్యాలయ అధికారులు హనీఫ్, ఇలియాజ్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ కుమార్ రెడ్డి, డీఈ నాయక్, సూపరింటెండెంట్ రామాంజనేయులు, ఆర్టీపీఓ మధు, డీటీసీపీవో సుదర్శన్, సహాయ కమిషనర్ గోవర్ధన్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీఎంఎం గోపి, పలమనేరు, పుంగనూరు పురపాలక అధికారులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేసింది చంద్రబాబే

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : రైతులను, డ్వాక్రా మహిళలను ఎక్కువగా మోసం చేసింది చంద్రబాబేనని డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి ధ్వజమెత్తారు. నరసింహాపురం సచివాలయం పరిధిలో గురువారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. రైతులు, డ్వాక్రా మహిళల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని చెప్పిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక ఎగ్గొట్టారని గుర్తుచేశారు. కుప్పంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్ కూడా రాకపోవడంతో చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. అందుకే ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో చంద్రబాబు కుప్పంలో పర్యటిస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా అక్కడ ఓటమి ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు పరిపాలనలో ప్రభుత్వాస్పత్రికి వెళ్లాలంటేనే ప్రజలు భయపడేవారని. ఇప్పుడు అత్యున్నత వసతులతో, అత్యాధునిక పరికరాలతో కళకళలాడుతున్నాయని వెల్లడించారు. ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న జగనన్న అందరి గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అన్నళగన్, వైస్ ఎంపీపీ శేఖర్ యాదవ్, మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్‌తోపాటు స్థానిక నాయకులు, మండల అధికారులు పాల్గొన్నారు.

అత్యాధునిక స్కానింగ్..ఉచితం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యసేవలను మెరుగుపరుస్తూ అత్యాధునిక స్కానింగ్ సేవలను ఉచితంగా అందిస్తోంది. ఇందుకోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చింది. పేదలకు మెరుగైన వైద్యంతోపాటు పైసా ఖర్చు లేకుండా స్కానింగ్ సేవలు కల్పిస్తోంది. ఈ ఖరీదైన సేవలను ఉచితంగా అందిస్తూ అక్రమాలకు చెక్ పెట్టింది.

- ప్రభుత్వ ఆస్పత్రిలో ఖరీదైన యంత్రాలు
- ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సిటీ, ఎమ్మారై స్కానింగ్‌లు
- ఆస్పత్రికి వచ్చే వారికే ఉచితం



సిటీస్కానింగ్



స్కానింగ్‌కు క్యూలో వేచియున్న గర్భవతులు

జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి స్కానింగ్, ఎక్స్‌రేల వివరాలు

రకం	మార్చి	ఏప్రిల్	మే
సీటీ స్కాన్	1159	985	997
ఎక్స్‌రే	4032	3992	3842
ఎంఆర్‌ఐ	325	297	311
అల్ట్రాసౌండ్	1239	981	1401

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం 1000 మందికిపైగా ఓపీకి వస్తుంటారు. గర్భిణులు ప్రతి రోజు 50 నుంచి 60 మంది వరకు వస్తుంటారు. వీరిలో చాలా మందికి స్కానింగ్, ఎక్స్‌రే సేవలు అవసరమవుతుంటాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం విలువైన ఆ పరికరాలను ఆస్పత్రికి అందించింది. డిజిటల్ ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలు ఆస్పత్రిలో నిరంతరం అందుబాటులో ఉంటున్నాయి.

ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా...

ప్రస్తుతం అత్యాధునిక పరిజ్ఞానం కలిగిన టెస్లా ఎంఆర్‌ఐ స్కానింగ్ యంత్రంతో పాటు, సీటీ స్కాన్ అందుబాటులో ఉంది. అల్ట్రాసౌండ్ స్కానింగ్ యూనిట్లు, అత్యాధునిక డిజిటల్ ఎక్స్‌రే యూనిట్లు అందుబాటులో ఉన్నాయి. నిత్యం 30 నుంచి 50 మంది వరకూ అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేస్తుంటారు. 20 నుంచి 30 వరకూ సీటీ స్కాన్లు 10 నుంచి 15 మందికి ఎంఆర్‌ఐ స్కానింగ్ చేస్తూ, సకాలంలో రిపోర్టులు అందిస్తుంటారు. అత్యవసర రోగులకు వెంటనే రిపోర్ట్ అందేలా చూస్తున్నారు. దీని కోసం సాంకేతిక నిపుణులను సైతం నియమించింది. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే ప్రతి పేదవాడికి స్కానింగ్ సేవలు ఉచితంగా లభిస్తోంది. పైసా ఖర్చులేకుండా రిపోర్ట్ ఇస్తున్నారు. మరిన్ని పరికరాలు తెప్పించేందుకు అధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించారు.

దోపిడీకి చెక్

ఏడాది క్రితం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో స్కానింగ్ చేయిస్తున్నారు. ఈ బెడద అధికం కావడంతో ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది కొందరికి కాసులు కురిపిస్తోంది. ఈ విషయం బయటకు రావడంతో ఆస్పత్రి ఉన్నత స్థాయి అధికారులు వెంటనే స్పందించారు. అపోలో నిర్వాహకులు సైతం స్పందించి అక్రమ స్కానింగ్‌లను ఎక్కడికక్కడ కట్టడి చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ తీసుకుని డాక్టర్ ప్రిస్కిప్షన్ ఆధారంగానే ఎక్స్‌రే చేయిస్తున్నారు. ఆస్పత్రిలో డాక్టర్ సూచనల మేరకు అడ్మిట్ అయితేనే సీటీ, ఎంఆర్‌ఐ స్కానింగ్‌కు అనుమతిస్తున్నారు. దీంతో సిబ్బంది చేతివాటానికి చెక్ పడింది.

స్కానింగ్ సేవలు మెరుగు



"గతంలో కంటే ఇప్పుడు స్కానింగ్ సేవలను మెరుగుపరిచాం. ఇప్పుడు ఆస్పత్రి ఓపీతో పాటు స్కానింగ్‌కు సేవలకు క్యూ పెరిగింది. సకాలంలో స్కానింగ్‌లు చేస్తూ, రిపోర్ట్ ఇస్తున్నాం. పైసా వసూళ్లు చేయకుండా సేవలు చేయిస్తున్నాం. మరిన్ని పరికరాలను కూడా తెప్పించే ప్రయత్నం చేస్తున్నాం. అక్రమాలకు తావు లేకుండా చూస్తున్నాం.

– డాక్టర్ అరుణ్‌కుమార్, సూపరింటెండెంట్

23 నుంచి ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా చెన్నై రోడ్డులో వెలసిన శ్రీద్రౌపతీ సమేత ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 23 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన ఆలయంలోని ఏర్పాట్లను పరిశీలించారు. పదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ ఏడాది అగ్నిగుండం తొక్కే భక్తులకు కంకణానికి వసూలు చేసే రుసుం పూర్తిగా ఉచితమన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, ఆలయ ఇంజినీరింగ్ ఏఈ వేణుగోపాల్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, ప్రముఖులు భాస్కర్ ముదిరాజ్, పసల కుమారస్వామి, బాలిశెట్టి నరసింహులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రైవర్ పోస్టుల భర్తీ



పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్ : జిల్లాలోని దిశా పోలీస్ స్టేషన్లలో డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రశాంత్ నగర్‌లోని జిల్లా పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లో గురువారం కూడా కొనసాగింది. ఇంటర్వ్యూలకు 60 మంది హాజరు కాగా ట్రాఫిక్ నియమ నిబంధనలు, రోడ్డు భద్రతపై పరీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ సుధాకర్, ట్రాఫిక్ డీఎస్పీ విష్ణువీర్, అధికారులు శ్రీనివాస రావు, మధుసూదన్ రావ్, మధు తదితరులు ఉన్నారు.

తెలుగుగంగ కాలువలో పడి ఒకరి మృతి



లక్ష్మణ ప్రసాద్ (ఫైల్)

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): మండలంలోని తెలుగుగంగ కాలువలో పడి ఒకరు మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాఘవేంద్ర కథనంమేరకు మధ్యప్రదేశ్‌కు చెందిన లక్ష్మణ ప్రసాద్(35) ఓ ప్రయివేటు కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. చిట్టత్తూరు సమీపంలో ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు తెలుగుగంగ కాలువలో దిగి కాలుజారి ప్రవాహంలో మునిగిపోయాడు. తోటి కార్మికులు పోలీసులకు సమాచారం అందించగా చిట్టత్తూరు సమీపంలోని కొత్తకండ్రిగ వద్ద మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది. మృతునికి ఇంకా వివాహం కాలేదు.

ఉపాధిలో వెనుకబాటు ఎందుకు?

- పనిదినాల పురోగతికి చర్యలు చేపట్టండి
- ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించని వారికి నోటీసులు ఇవ్వండి
- సమీక్ష సమావేశాల్లో కలెక్టర్ షణ్మోహన్



కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా కొన్ని మండలాల్లో ఉపాధి పనిదినాలు కల్పించడంలో ఎందుకు వెనుకబడుతున్నారని కలెక్టర్ షణ్మోహన్ క్షేత్రస్థాయి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లో గురువారం ఆయన పలు శాఖల అధికారులతో వరుస సమీక్ష సమావేశాలు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాలోని కొన్ని మండలాలు వెనుకబడి ఉన్నాయన్నారు. డ్వామా ఏపీడీ, ఏపీవోల పనితీరు మెరుగు పరుచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో తగినంత సిబ్బంది ఉన్నప్పటికీ ఉపాధి పనిదినాల పురోగతి కనిపించడం లేదని చెప్పారు. ఏపీడీ, ఏపీఓలు ఉపాధి పనుల కల్పన, పని దినాల పెంపు తదితర అంశాల్లో శ్రద్ధ పెట్టకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎంపీడీఓలు ఉపాధి పని దినాల పెంపునకు ఆయా మండలాల పరిధిలో ఏ పంచాయతీలో సమస్యలున్నాయో గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేసుకోవాలని సూచించారు. ఎంఈవోలు, హెచ్ఎంలు సమన్వయంతో వ్యవహరించి, నాడు–నేడు రెండో విడత పనులను వచ్చే సోమవారంలోపు పూర్తిచేయాలన్నారు. నాడు నేడు పనులు నిర్వహిస్తున్న పాఠశాలల్లో విద్యార్థులకు ఎటువంటి సమస్య తలెత్తినా ఎంఈవోలే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యార్థుల సంక్షేమాన్ని దష్టిలో ఉంచుకుని పాఠశాల కమిటీ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు భాగస్వామ్యంతో పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన పనుల్లో మంజూరైన పనుల పురోగతికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బి ఎస్ఈలు చంద్రశేఖర్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామా పీడీ గంగా భవానీ, సీపీఓ ఉమా దేవి, డీపీఓ లక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకట రమణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, డీఆర్డీఏ ఏపీఎం రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఇళ్లు మంజూరైనా నిర్మించుకోరా?

ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేసినప్పటికీ ఎందుకు నిర్మించుకోవడంలేదని కలెక్టర్ ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఏవైనా సమస్యలున్నట్‌లైతే వెంటనే పరిష్కరించాలని తెలిపారు. హౌసింగ్ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గృహ నిర్మాణాలలో స్టేజి కన్వర్షన్ కచ్చితంగా జరగాలని తెలిపారు. జరగని పక్షంలో ఇంటి పట్టా, ఇల్లు, పొజెషన్ సర్టిఫికెట్ రద్దు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన తేదీల్లో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇళ్లు మంజూరు అయినప్పటికీ పనులు మొదలుపెట్టని లబ్ధిదారుల పట్టా ఎందుకు రద్దు చేయకూడదని ప్రశ్నించారు. అలాంటి వారిని గుర్తించి నోటీసులు ఇవ్వాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రభుత్వం గృహనిర్మాణాలకు ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. జగనన్న కాలనీల్లో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సమీక్షలో హౌసింగ్ పీడీ పద్మనాభం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,500
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,000
రిటైల్ వెండి గ్రాము	రూ.75

పొలాలపై ఏనుగుల దాడి



పాతపేటలో ఏనుగులు ధ్వంసం చేసిన డ్రిప్ పరికరాలు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాతపేటలో బుధవారం రాత్రి ఏనుగులు పంటపొలాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించాయి. మామిడి చెట్లు, కొబ్బరి చెట్లు విరిచేశాయి. పొలాల్లో అమర్చిన డ్రిప్ పరికరాలను తొక్కి ధ్వంసం చేయడంతో రైతులకు భారీగా నష్టం చేకూరింది.

మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం



నేర సమీక్ష సమావేశంలో పోలీసు అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్పీ రిశాంత్ రెడ్డి

- నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయండి
- డ్రగ్స్ విక్రేతలపై చర్యలు తీసుకోండి
- ఎస్పీ రిశాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ రిశాంత్ రెడ్డి ఆదేశించారు. చిత్తూరు నగరంలోని పోలీసుల అతిథి గృహంలో గురువారం ఎస్ఈబీ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ కేసుల ఇన్వెస్టిగేషన్లో నిబంధనలు పాటిస్తూ సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు వేగంగా పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చేయాలని పిలుపునిచ్చారు. నిఘా వ్యవస్థను బలోపేతం చేసి గంజాయి, నాటు సారా తయారీ, అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని చెప్పారు. డ్రగ్స్ నిందితులను, మాదకద్రవ్యాలు సేవించే వారిని గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని సూచించారు. నాటుసారా తయారీ, విక్రయ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో మహిళా పోలీసుల ద్వారా సమాచార వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. అక్రమ మద్యం, గంజాయి, నాటుసారా, అక్రమ ఇసుక, నిషేధిత మత్తు పదార్థాల రవాణా, ఇతర అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ శ్రీలక్ష్మి, అధికారులు అయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం



పురాతన ఆలయ తొలగింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండల కేంద్రంలోని ప్రాచీన ప్రసన్న వేంకటేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో మండల అధికారుల సమక్షంలో గురువారం శ్రీకారం చుట్టారు. గతంలో గ్రామస్తులు ఆలయాన్ని నిర్మించాలని మంత్రి రోజా దృష్టికి తీసుకెళ్లడంతో, ఆమె టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డితో మాట్లాడి, ఆలయ నిర్మాణానికి 1.7 కోట్లు మంజూరు చేయించారు. ఇందులో భాగంలో అధికారులు పరిశీలించి నిర్మాణ పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. ఆలయ పునర్నిర్మాణ పనులు స్థానిక తహసీల్దార్, పోలీసుల పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి.

బకాయిలు చెల్లించాలి

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బకాయిలు చెల్లించాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో పలు సంవత్సరాలుగా 44 వేల సర్వీసులకు గాను రూ.1000 కోట్లు బిల్లు పెండింగ్‌లో ఉంది. వీటిని దశల వారీగా చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రభుత్వ కళాశాలలో ప్రవేశాలపై దృష్టి



మాట్లాడుతున్న డీఈవో విజయేంద్రరావు

గంగాధరనెల్లూరు(కార్వేటినగరం): విద్యారంగంలో ప్రభుత్వం తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు మరింత పెరిగేలా దృష్టి పెట్టాలని డీఈవో విజయేంద్రరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం భారీ ఎత్తున ప్రణాళికలు రూపొందించి కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని గుర్తుచేశారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులను నియమించినట్లు వివరించారు. కార్పొరేట్ కళాశాల కన్నా ఎంతో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల బృందం, ఆధునిక వసతులతో జూనియర్ కళాశాలలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటు పాఠశాలల్లో వేలాది రూపాయలు ఫీజులు తీసుకుని అనుభవం, అర్హత లేని వారితో విద్యాబోధనలు సాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో రాజేంద్ర, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయరాలు హేమలత, ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలు ఢీ ఒకరి మృతి



మృతి చెందిన నాగరాజ

పుంగనూరు: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు మండలంలోని కొండందొడ్డికి చెందిన నాగరాజ (45), భార్య సుజాత ద్విచక్రవాహనంపై పొలిమేరలో ఉన్న ఆలయానికి బయల్దేరారు. కుమ్మరగుంటకు చెందిన శ్రీనివాసులు, భార్య ధనమ్మ మరో బైక్‌పై వస్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ సంఘటనలో నలుగురూ గాయపడ్డారు. వెంటనే స్పందించిన స్థానికులు క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషమ పరిస్థితిలో ఉన్న నాగరాజను తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. ఈమేరకు ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైళ్ల రాకపోకలకు ఏడు గంటలు అంతరాయం



నాయుడుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద మరమ్మతు పనులు చేస్తున్న అధికారులు, సిబ్బంది

నాయుడుపేటటౌన్: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నాయుడుపేట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 7 గంటల వరకు రైలు పట్టాల వద్ద మరమ్మతు పనులు చేపట్టారు. దీంతో సుమారు ఏడు గంటల పాటు రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నాయుడుపేట వైపు రాకపోకలు జరిపే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు గూడూరు, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో నిలిపి వేశారు. పినాకిని ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లు సూళ్లూరుపేటలో నిలిపివేశారు. సాయంత్రం నాలుగు గంటలకు రావాల్సిన పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు ఏడు గంటలకు పైగా నాయుడుపేటకు వచ్చింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చిదా మిల్లు కార్మికుల ఆందోళన తీవ్రం



చిదా మిల్లు వద్ద కార్మికులు, పోలీసుల మధ్య వాగ్వాదం

పుత్తూరు రూరల్: స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లు కార్మికులు రెండు నెలలుగా చేస్తున్న ఆందోళన గురువారం తీవ్రరూపం దాల్చింది. మిల్లులోని యంత్రాలు తరలించడానికి యాజమాన్యం సిబ్బందిని తీసుకురావడంతో మిల్లు వద్దే ధర్నా చేస్తున్న కార్మికులు అడ్డుకున్నారు. దీంతో మిల్లు వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అయితే సిబ్బంది మిల్లు లోపలికి వెళ్లడంతో కార్మికులు మిల్లు గేట్లకు తాళాలు వేశారు. మిల్లు మేనేజర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు మిల్లు వద్దకు చేరుకున్నారు. దీంతో పోలీసులకు కార్మికుల మధ్య వాగ్వాదం జరిగింది. ఈ నేపథ్యంలో సమాచార హక్కుల వేదిక కార్యదర్శి మురగారెడ్డి కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని పోలీసులకు తెలియజేస్తూ, యాజమాన్యంపై లిఖిత పూర్వక ఫిర్యాదును పోలీసులకు అందజేశారు. దీనిపై పోలీసులు యాజమాన్యంతో మాట్లాడి డీసీఎల్ వద్ద ఇరువర్గాల వారు సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో ప్రస్తుతానికి సమస్య సద్దుమణిగింది. ధర్నా కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఏలుమలైరెడ్డి, రవిచంద్రన్, రత్నం, నాగూర్, మాసల, రమేష్, శివలింగం, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో ఆరుగురికి జైలు



చీటింగ్ కేసులో శిక్షపడిన నిందితులను చూపుతున్న పోలీసులు

వరదయ్యపాళెం: శ్రీసిటీ పారిశ్రామికవాడలోని వీఆర్‌వీ పరిశ్రమలో ఇనుప ముడిసరుకు కొనుగోళ్లకు సంబంధించి తూకంలో మోసం చేసి లక్షల విలువైన ఇనుప ముడిసరుకును తీసుకెళ్లి పరిశ్రమకు లక్షల్లో నష్టాన్ని చేకూర్చిన కేసులో ఆరుగురి నిందితులకు జైలుశిక్ష, రూ.5వేల జరిమానాను విధిస్తూ సత్యవేడు కోర్టు తీర్పునిచ్చింది. ఈ ఘటనకు సంబంధించి 2016లో పరిశ్రమ యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు సెక్షన్ 420 కింద చీటింగ్ కేసు నమోదైంది. ఈ కేసులో ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆధారాలు, సాక్ష్యాలను కోర్టుకు తెలియజేయడంతో గురువారం పూర్వాపరాలను పరిశీలించిన సత్యవేడు కోర్టు ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి ముద్దాయిలను దోషులుగా తేల్చుతూ శిక్షను ఖరారు చేశారు. శిక్ష పడిన వారిలో ముద్దాయిలు చైన్నైకి చెందిన హకీం భాషా (24), జాకీర్ హుస్సేన్ (32), షాహుల్ హమీద్ (26), మహ్మద్ రఫీ (30), నాగలాపురం మండలం, బీరకుప్పం గ్రామానికి చెందిన రామరాజు (25), సత్యవేడు మండలం, మాదనపాళెం గ్రామానికి చెందిన చెంగయ్య (26) ఉన్నారు.